కాంతి

శ్రీ గోగినేని సత్యనారాయణ

1

"మా నాన్న, కాంతీ, ఉదయం వొచ్చారు."

"అరెరె పాదాలు తాకగూడదమ్మా."

"రంగారావుగారి అమ్మాయి నాన్నా, కాంతి."

"నీకు శుభం కలుగుతుందమ్మా."

"ఏం శుభం నాన్నా, ఇప్పు డా అమ్మాయి కేం లోపమని ?"

"చదువుకున్నా మీరు పిచ్చిపిల్లలేరా, ఏం శుభమని అడుగుతావేం ? శుభం జరిగాక చూడాలి. శుభంకోసం ఎదురు చూడాలి, అంతే."

"ఇంకేం కాంతీ, మా నాన్న అంటున్నారు—అన్నారంటే అయిందన్నమాటే. పో నీకు శుభం కలుగుతుంది."

"చిత్తం."

"ఒస్తున్నది రంగారావుగారి భార్య నాన్నా."

"భాస్కర్ వాన్నగారు అమ్మా."

"నమస్కారాలు అన్నయ్యా .... వస్తారనే అనుకుంటున్నాం .... సుఖంగా జేరారా ?"

"ఆఁ, ప్రయాణం సుఖంగానే జరిగిందమ్మా."

"అలాగే నిల్చున్నారేం భాస్కర్, ఆ గదిలోకి తీసుకుపో. వారు ఇదుగో వస్తున్నానని వెళ్లారు. ఒస్తూనే ఉండాలి ఈపాటికి. ఇంతలో టీ పంపుతాను, పదండి."

"ఇప్పుడే తీసుకున్నామమ్మా, శ్రమపడకు మాకోసం."

"టీదేం శ్రమ అన్నయ్యా, అటువెళ్లి కూర్చోండి, ఒక్క క్షణం."

"ఒద్దమ్మా టీ వొద్దు, దాన్ని చూడటానికే బాగుండదు .... చెప్పవేంరా, ఇప్పుడు తాగించి, అలాగే చూస్తూ నిల్చుంటావు ?"

"టీ దెంత భాగ్యం నాన్నా, పోనీ కాఫీ తెండి."

"నీకు మతిపోయిందిరా."

"నన్ను బిడ్డలా చూచుకుంటారు నాన్నా, ప్రేమగా పెట్టేచోట ఎందుకు ఒద్దనాలి.?"

"వెయ్యేళ్లు వర్ధిల్లు బాబూ."

. . . . . .

"ఏం చదువుకుందిరా అమ్మాయి."

"ఏఁ, బాగావుందా ?"

"అన్ని కొక్కిరాయిప్రశ్నలేనటరా ? ఇందాక ఏం శుభం అంటావ్ ? ఇప్పుడు బాగుందా అంటావ్ ?"

"ఇక నన్నే కొక్కిరాయి అంటున్నావు నాన్నా, ఆపిల్ల నిక కోతిపిల్ల అనాల్సిందే."

"ఒరే నీఅంత చదువుకోకపోయినా, పాలేవో నీళ్లేవో గ్రహించగలనురా—బొత్తిగా తీసిపారెయ్యకు. పాదాలు తాకేటంత మాలిమి కోతిపిల్లకు ఎలా ఏర్పడుతుంది ?"

"సరే చూద్దాగానిగా, పిలవనా మరి ?"

"పిలూ, కాసేపు కూర్చుందాం."

"అదుగో పిలవకుండానే దూకుతోంది, ట్రే తీసుకుని. దయచేయండి శ్రీమతిజీ."

"నాకేం అభ్యంతరేదు బిరుదులన్నీ, తమరే అట్టి పెట్టుకోవచ్చు."

"శ్రీమతిజీ అనే బిరుదేనా ?"

"అదే వుంచుకున్నా నాకేం అభ్యంతరం లేదు."

"చూడు నాన్నా మీ అబ్బాయిని పట్టుకుని."

"ఎప్పుడో యేదో పేరు పెడుతూంటాడండీ; పోనీ లెమ్మని ఊరుకుంటే ప్రతిసారీ యింతే. మిమ్మల్ని చూచి ఊరుకుంటే, మితిమీరుతున్నది రోరోజూ."

"మా నాన్నని చూసి ఊరుకున్నావా ?"

"నన్నెప్పుడు చూశావమ్మా ?"

"ఎక్కడో జూసినట్టుగా ఉంది జ్ఞాపకం."

"నన్నా ?"

"పోనీ నన్ను మీరు చూశారా ?"

"ఏమిటో చూశానేమో అనిపిస్తోంది."

"ఏమిటి, కాంతిని చూశావా నాన్నా నువ్వు ?"

"అట్లా అనిపిస్తోందిరా."

"ఎందుకు అనిపిస్తోందో చెప్పనా నాన్నా ? కాంతి నిన్ను బుట్టలో వేసుకుంది. మనిషి యిష్టమయితే, ఎప్పుడో .... ఎక్కడో .... ఎట్లాగో చూసినట్టే అనిపిస్తుంది. ఇంకే మీ రిద్దరూ బంధువు లయారుగా. నేనే నన్నమాట పరాయి వాణ్ణి !"

"కాఫీ ఆరిపోతున్నయి తాగండి."

"ఇంకా అండీ లెందుకు, కలుపూ చుట్టరికం .... పడిపోయావు నాన్నా వలలో."

"ఏం కలిపితే తప్పా ? అమ్మకు అన్నగారు, నాకు ?"

"మాట జారితే పీక పట్టుకునే రకం నాన్నా, మనకు పీళ్లతో వరస లేమిటి ? శ్రీమతిజీ అన్నందుకు కోపం, అందులో ఏం బూతు ఉంది ? నన్నే శ్రీమతి అంటుందా ? హుఁ ?"

"మిస్టర్ ఆట్టే ప్రసంగం మంచిదికాదు. మాజోలి నీ కెందుకు ? చెప్పరేమండి, మామగారి యెదటన్నా కాస్త బుద్ధిగా ఉంటా డనుకున్నాను. ఇంత పోకిరిని యెలా భరించారండి !"

"కన్నందుకు తప్పేదేముందమ్మా ?"

"ఇద్దరూ కలిసి నామీద పడుతున్నారా ? నేనేమో శ్రీమతినా ? సరే వంటయింట్లోకి పోతున్నాలే, శ్రీయుతులు మాట్లాడుకోండి."

. . . . . .

"ఎప్పుడూ యింతేనండి. ఈ గదిలో కాలు నిలవదు. వంట యింట్లోకి పోతాడు సరాసరి."

ఇంటిదగ్గరా అంతేనమ్మా. వాళ్ల పిన్నిదగ్గరా, వాళ్ల అక్క దగ్గరా పోయి ఆ పొయ్యిపాగలో కూర్చుంటాడు గాని— బయట వాళ్ల బాబాయి నలుగురు చదువుకున్నవాళ్లతో కూర్చుంటాడుగదా, అక్కడ క్షణం కూర్చోడు. ఆత్మబంధువు ల్లాగా మీరు దొరికారు వాడికి. బాధలేకుండా ఉంటున్నాడు. 'నా' అనేవాళ్లను వొదిలి ఎప్పుడూ ఉండనివాడు. ఎంత యిదౌ తాడో అనుకున్నాను. ఇంత స్నేహంగా వాడు మీ యింట్లో తిరగటం చూస్తుంటే, నా కెంత సంతోషంగా ఉందనీ !"

"ఇక్కడా అంతేనండి, నాన్నతో కూర్చోనే కూర్చోడు. ఎప్పుడూ అమ్మతోనే కూర్చుంటాడు. ఈమధ్యనుంచి మరీని'

"నాన్నగారు ఏం చేస్తుంటారమ్మా."

"నాన్నగారా, నాన్నగా రెప్పుడూ ఏదో చేస్తూనే ఉంటారు. బొత్తిగా విశ్రాంతితీసుకోరు. ఆ ఎంజినీరుగిరీ నుంచి రిటైరు అయేరోజులూ దగ్గరపడినై. ఇంకా ప్రొద్దస్తమానమూ వాళ్లొచ్చారమ్మా, వీళ్లొచ్చారమ్మా ఎలా కాదంటాం అంటారు."

"ఏరీ, యింకా రాలేదే ?"

"నే చెపుతుంటినే, ఇదుగో వస్తానని వెళితే, ఏ సాయం కాలమో రావటం."

"వీడేడి పోయి యింట్లో కూర్చున్నాడు. పోనీ, మళ్లీ అయినా వస్తాం."

"నే నన్నాననా ? ఇవాళ వొచ్చేస్తారు. త్వరగా వొచ్చే స్తారు—అమ్మ చెప్పింది మీ రొస్తారని. ఇదుగో వస్తాను, నే నొచ్చిందాకా పోనీక మన్నారు."

"నేను మీకేం పరిచయం అమ్మా, యింత కట్టడి చేసిపెట్టుకోటానికి నాకోసం ? మీయింటి పరిచయంతో నిజంగా నాకెంత గర్వం కలుగుతుం దనుకున్నావ్ ? ఏరీ ఈ కాలంలో యిలా మర్యాదగా ప్రవర్తించేవాళ్లు ? పెద్ద యింజ నీరు, పట్టణ వాస్తవ్యులు—ఒక చదువురాని పల్లెటూరి రైతును యింతగా ఆదరిస్తుంటే, నాకు గర్వంకాక యింకేం కలుగు తుంది చెప్పమ్మా ?"

"మాకేం పొగడ్తలు అక్కర్లేదండి, అర్హులయిన వాళ్లే ఈ యింట్లో ఆదరణ పొందుతారు. నాన్నగారికి పల్లె టూరు అంటే ఎంతో యిష్టం. రిటైరు అయింతర్వాత ఏ పల్లెటూరులోనైనా చిన్న యిల్లు గట్టుకుని, అక్కడ ఉందాం అంటారు. ఆత్మాభిమానం, మర్యాదా తెలిసినవా ళ్లెవర్నీ నాన్న చులాగ్గా పోనీరు. తాటిముంజెలు, ఈతపళ్ళు తేగలూ .... ఇలాంటివి ఎప్పుడూ గుర్తు తెచ్చుకుంటూ ఉంటారు."

"ఒక్కమా టడగనా తల్లీ, మీ తాతగారు మామూలు రైతేనా ?"

"అవుననుకుంటాను, నాన్న చెప్పే కథలనుబట్టి."

"లేకపోతే ఈ రుచులూ, ఈ ప్రేమా కలగవమ్మా."

"ప్రేమించేవాళ్ళకు ప్రేమ యెప్పుడూ అందికలోనే వుంటుంది. నన్ను అమ్మా అని నోటార నాన్న పిలుస్తారు అంతే. అమ్మ గూడ పేరునే పిలుస్తుంది. మళ్ళీ మీరు అమ్మా అంటుంటే, నాకు మా నాన్నదగ్గర కూర్చున్నట్టుగా వుంది. ఎంతమంది ఈ పరాయితనాన్ని దూరంగా వుంచుతారు చెప్పండి"

"పిచ్చిపిల్ల, నీకు పల్లెటూరు తెలిసివుండదు. లేకపోతే 'అమ్మా' అనిపించుకోటానికి ఇంత సంబరపడి, నన్ను యింతగా అనుకోటానికి యేముంది? బిడ్డలగన్న యే తండ్రీ పిల్లల్ని కసురుకోడు. ఎందుకు కసురుకుంటాడు? సరేగాని, నువ్వు చెప్పుతల్లీ, చదువుకున్న పిల్లలంతా యింత భక్తిశ్రద్ధలు కలిగివుంటారా?"

"పల్లెటూర్లో అంతా మనుషుల్ని యింత ప్రేమిస్తా రాండి ?"

"నువ్వు అవటానికి చిన్న పిల్లవుగాని, నీకు ప్రపంచం తెలుసునమ్మా. నీకు నిజంగా శుభం కలుగుతుంది. భగవం తుడు నీకు మేలుచేస్తాడు.

"ఏం శుభమో అడగగూడదన్నారు గదూ."

"చెప్పనా, ఏం శుభమో చెప్పమంటావా ? నీకు వరహా లంటి మొగుడు దొరుకుతాడు. నీ పెళ్లికి పదిరోజులు ముందూ, పదిరోజులు వెనకా వుండి భోంచేసి వెళతాను."

"ఇంతేనా ?"

"ఇంకేం కావాలి చెప్పు."

"ఏం చెప్పను, మీరు లిమిట్ పెట్టేస్తిరిగా."

"చెప్పు, ఏం కావాలంటే అది యిస్తాను."

"నిజంగా యిస్తారా ?"

"తెలుసుగా నీకు నా సత్తా, అడుగు అంతలో."

"మీ సత్తాతో నాకేం పనిలేదు. కాని నాకో బుల్లి కోరిక ఉంది."

"చెప్పు మరి."

"తీరుస్తానంటే చెపుతాను."

"బుల్లిపిల్ల కోరే బుల్లి కోరిక తీరదా ? చెప్పు, ఏం కావాలి చెప్పు."

". . . . . ."

"ఊ చెప్పు మరి."

"నన్ను మీతో తీసుకుపొండి."

". . . . . ."

"మీ యింటో నాగ్గూడా కొంచెం జాగా యివ్వండి."

". . . . . ."

"ఏం, మీ పంచకు రానీరా నన్ను, ఎందుకు నిశ్శబ్దంగా ఉన్నారు."

"ముసలివాడి గోడు యింత ఆలోచించకుండా, అలా ప్రశ్నిస్తావే, అంత రెట్టిస్తే నేనేం చెప్పనమ్మా .... ఇంత ఇరుకునపెడితే నే నేమయిపోతాను ?"

"మీరు పశ్చాత్తాప పడరండి, ఏమాట చెపితే ఆమాట వింటాను."

"నీవు వినవని గాదమ్మా, కాని యింకెన్ని బాధలు నేను ఆలోచించుకోవాలో నీకేం తెలుసు ? నాకు ఎన్ని ప్రశ్నలు ఎదురవుతాయో, ఎందరికి నేను సమాధానం చెప్పుకోవాలో—నీకేం చెప్పను ? నన్నిట్లా ఒత్తిడిపెట్టడం నీకు న్యాయంగాదమ్మా."

"మీ మాటమీద ఆధారపెట్టాను నా జీవితాన్ని, ఏం చేసినా సరే."

"వాడిని కొంచెం పిలూ తల్లీ."

"ఏం, వెళ్లిపోతారా ?"

"ప్రతి చిన్నమాటతో నా గుండెలమీద పిండి గొడుతున్నావమ్మా నువ్వు."

"సరే పిలుస్తా నుండండి. నాన్నే మీ దగ్గర కొస్తారు.'

.....

2

"భాస్కర్."

"నాన్నా."

"తిన్నగా సమాధానం చెప్పాలి. కాంతి నన్నేమి అడిగేదీ నీకు తెలియదా ?"

"సరిగా తెలీదు. కాని ఊహించాను."

"ఇందుకేనా నన్ను రప్పించింది ?"

"కాంతి సలహామీదే రాశాను."

"పన్నాగంమీద ఉన్నారన్నమాట. ఉచ్చులువేసి, అందులోకి నన్ను యీడుస్తారు."

"అంత పెద్దమాటలు ఉపయోగిస్తున్నావు, యిందులో యే యిద్దరూ కలిసి యిలా చేద్దాం అని ఆలోచించుకోలేదు. నిజంపడితే, కాంతి నిన్ను యేమడిగిందో గూడా నాకు తెలీదు. కాంతి నాకు చెప్పిందల్లా మీ రిక్కడికి వచ్చేట్లు చేయమని. అంతే."

"అది అట్లాఉంచు. కాంతితో నీకీ సంబంధం ఏమిటి?"

"క్షమించు నాన్నా, కాంతితో నా సంబంధాన్ని శంకించాల్సిన పనిలేదు. నీకు తెలీకుండా యే ముఖ్యమైన పనీ చెయ్యనని ఎన్నోసార్లు మాట యిచ్చాను. బహుశా మరిచిపోయి ఉండవు. అందుకు భిన్నంగా నేను అంగుళంమేర నడవలేదు. కాంతికీ నాకూ ఉన్న సంబంధం స్నేహం మాత్రమే."

"అయితే నేను చెప్పేసెయ్యవచ్చునుగా."

"ఏం చెపుదామని ?"

"కుదరదని."

"ఏం కుదరదని ?"

"పెళ్లి కుదరదని. ఏమిటీ రెట్టింపు ?"

"అంత కఠినంగా ఎలా చెపుతున్నావు నాన్నా, ఎందుకు కుదరగూడదు ?"

"నాకు ముసుగులో గుద్దులాట పనికిరాదు. నువు చేసుకుంటానంటావా ఆ పిల్లని ?"

"మీ అనుమతి అయితే."

"నా అనుమతి ఎలా దొరుకుతుం దనుకున్నావ్ ?"

".....''

"మీ అక్కయ్యకు ఏం చెపుతావ్ ?"

"నన్నర్థంచేసుకోటానికి ప్రయత్నించు నాన్నా."

"పాతికసంవత్సరాలనుంచీ అర్థం చేసుకుంటూనే ఉన్నాను నిన్ను. అది నాకు చెప్పఖ్కర్లేదు. ఇంటికి పోయినప్పుడల్లా నీడకంటే మిన్నగా నీ చుట్టూతిరిగే పిల్లముఖం మళ్లీ యెట్లా చూస్తావు ?"

"నేను బలహీనపడిపోయాను నాన్నా, మీ క్షమాపణ గోరుకోవటంకన్నా నేనేమీ చేయలేను."

"నిన్ను మోసంచేశారు. ఇవాళే చెపుతాను రంగారావుగారికి."

"క్షమించు నాన్నా, నా గురించి నీ కెంత తెలుసో, రంగారావుగారికీ అంతే తెలుసు ఈ విషయం. బిడ్డమీది నమ్మకంచొప్పున ఆయన మాజోలి కెన్నడూ వచ్చేవారు గాదు."

"అబద్ధం. ఇదంతా అబద్ధమయి ఉంటుంది. ఇంటికి పిలిపించి, వరసలు కలిపి, కోరిక తీర్చరా అని అడిగి, మెల్లగా—లేదనటానికి వీల్లేకుండా—యిలా టక్కులు పన్నిన వాళ్లు .... నిన్ను తప్పకుండా మోసంచేసి ఉంటారు. వాళ్ల పిల్లతో నీకు వేరే సంబంధం లేదన్నావుగనక మనలో యేమీ తప్పులేదు. చెప్పేస్తాను, వీల్లేదని."

"నువు చెపితే తప్పులేదు నాన్నా, కాని ధర్మం కూడా లేదు. నిజంపడితే వాళ్లకి మనను మోసం జేయాల్సిన అవసరం యేమిటి ? మనకంటే హోదాగలవాళ్లు. మనకంటే చదువుకున్నవాళ్లు. మనకంటే ఆస్తులు గూడా ఉండవచ్చు .... మనమా పల్లెటూరి మనుషులం .... మనని వాళ్లు మోసం జేసి పాముకునే దేముంటుంది ? పోనీ మనం వాళ్లచేతికింద పడివుంటామని ఈపని చేస్తున్నారేమో ఆలోచించు. నీ కాళ్లు పట్టుకున్నంత యిదిగా వాళ్లు ప్రాధేయపడటం దేనికి ? వాళ్లు మనను మోసం జేయటంలేదు నాన్నా, ప్రేమిస్తున్నారు; అంతే."

"అయితే ఆపిల్లను చేసుకుంటానంటావ్ ?"

"మీ అనుమతి ఉంటే."

"లేకపోతే."

"చేసుకోను."

"ఖాయమేనా యిది ?"

"అక్షరాలా ఖాయం. అందుకని మీ మానవత్వం కోల్పోవద్దు. విచక్షణకు దూరం కావద్దు. ధర్మం ఆలోచించు."

"నువు ఆలోచించావా ? అక్క నీకోసం ఎప్పటినుంచి ఎదురు చూస్తుందో యేమైనా గమనించావా ?"

"అక్కకి తన రక్తంమీద ప్రేమ నాన్నా, వీళ్లేం చూసి ప్రేమిస్తున్నారు ?"

"అందుకని అక్కగొంతు కోస్తానంటావా ?"

"నాన్నా అంతపదా లెందుకు చెప్పు. కాని ప్రేమించే వాళ్లను తోసెయ్యా లంటావా ? అక్క నన్ను ఎప్పుడూ తమ్ముడుగా ప్రేమిస్తుంది. మనని యింతగా ప్రేమించే కుటుంబాన్ని యింకోదాన్ని మన రక్తంతో కలుపుకుంటే నష్టం ఏమిటి ?"

"నేను దాని తండ్రినిరా. నీమాట తీసివేయొద్దని నీవెలా కోరుతున్నావో, తనని నానుంచి విడగొట్టవద్దని అదీ అట్లాగే కోరుతుంది. దీనికి అనుమతిస్తే నేను గొడ్డుమోతు కింద లెఖ్ఖ అవుతాను."

"కాంతి యింకొకరిపిల్ల కాబట్టేగా నాన్నా, ఆపిల్లని వదిలెయ్యటానికి యింత పట్టుబడుతున్నావు ! కాంతిని గూడా నీ బిడ్డగా ఆలోచించు—ఏది గొడ్డుమోతుతనమవుతుందో !"

"ఒరే నన్నిట్లా యిరుకునపెట్టి మాట్లాడవద్దు. నేను దీనికి ఒప్పుకోలేను. ఈ పెళ్లి జరగటానికి వీల్లేదు. అంతే. నాతో వాదించకు."

"సరే నాన్నా, నీతో వాదించను. నేను పెళ్లి చేసుకోను."

"ఏమిటీ, కాంతితో పెళ్లి మానేసినట్టేనా ? చెప్పెయ్యనా ఆ మాట ?"

"ఆ చెప్పెయ్యవచ్చు. చెప్పేటప్పుడు ఈమాట చెప్పు. కాంతిని మానుకుంటున్నాడని చెప్పవద్దు. పెళ్లి మానుకుంటున్నాడని చెప్పు.

"అసలు పెళ్లి చేసుకోవూ ? నీకు మతిపోయింది."

"ఏం పోయిందో సరిగా చెప్పలేను గాని, ఏదో పోయిన మాట నిజమే. మనుషులు ప్రేమిస్తారు నాన్నా. ఆ ప్రేమను మళ్లీ అందించకపోతే పశువులకింద జమ అవుతారు మనుషులు. నన్ను ప్రేమించినవాళ్లను తిరస్కరించితే నాకేం ఒరుగుతుంది నాన్నా ?"

"అక్క నీకు శత్రువయిందన్నమాట !"

"కాదు నాన్నా. అక్క యెప్పుడూ నాకు ఆత్మ వర్గంలోనిదే. కాని అక్క కాంతి అంత దూరంగా జన్మించి ఉంటే, అక్క ప్రేమ కాంతి ప్రేమతో పోల్చటానికి వీల్లేనంత తక్కువగా ఉండేది. అక్క నా వ్యక్తిత్వానికంటే, తన రక్తాన్ని యెక్కువగా ప్రేమించింది. నిజం చెప్పవలసివస్తే, అక్కకు తమ్ముడు తెలుసు గాని, తమ్ముడి లక్షణాలు తెలీవు. సరిగా ఆలోచించి నువ్వే చెప్పు నాన్నా."

"నువ్వు పశువ్విరా. దాని ప్రేమనే శంకిస్తున్నావా ?"

"శంకించటంలేదు నాన్నా."

"నీ సంజాయిషీ అక్కర్లేదు. నీమాటే నీదంటావా ?"

"నేనేం చెయ్యను చెప్పు."

"చేసుకుంటే కాంతిని; లేకపోతే పెళ్లి చేసుకోనంటావ్ ?"

"వేరే మార్గం నాకు కనబడటంలేదు."

"కర్కోటకుడివిరా. నీ అంత కపటుడు లేడు. అతి వినయం ధూర్తలక్షణం అని, నీ కిష్టంలేని పని చెయ్యను నాన్నా అని నన్ను అందలం యెక్కించి, ఇవాళ యిట్లా గుంటలోకి తోస్తావట్రా ?"

"నీ కిష్టంలేని పని చెయ్యను నాన్నా."

"అయితే అక్కమాట తీరుస్తానను."

"నీముందు నా మాటకు పెడర్థం తీయటానికి సిగ్గుపడుతున్నాను నాన్నా. కాని బలవంతం చేస్తున్నావు. నీ కిష్టంలేని పని చేయనన్నాను గాని, యిష్టం అయిన పని చేస్తా నన లేదు. నేనిక నేం చేయలేను."

"నువ్వు కిరాతకుడివి. పో, నీ పెళ్లికీ—నా పాడెకీ, ఏర్పాటు చెయ్యి."

"నీ కిష్టంలేని పనిని చెయ్యను నాన్నా. కాంతిని పెళ్లి చేసుకోవడంలేదు. నాపెళ్లి చేయవలసింది నీవు. నేను సొంతంగా చేసుకోను."

"నా చేతులమీదుగా చెయ్యను. నా మనుమరాలు నా కోడలు కాటానికి వీల్లేకపోతే, నేనీ లోకంలో ఉండను. కానీ, ఏది నీ నిశ్చయమో .... "

"నీ కొడుకు నీతోపాటే వస్తాడు తీసుకెళ్లు నాన్నా."

"....."

"....."

"భాస్కర్."

"నాన్నా."

"కాంతి నీ గుండెకు యింత బలం పెట్టిందటరా ?"

"కాంతి నాతోవుంటే, నిజంగానే నాకు ఎంతో బలం నాన్నా. ఈ ఒక్క కోరిక తీర్చవూ ?"

"సరే పద, నీకన్నా ఉండాలి, నాకన్నా ఉండాలి. అక్కకు నీవే సమాధానం చెప్పుకోవాలి సుమా !"

"సమాధానం గాదు, బ్రతిమాలుకుంటాను నాన్నా."

"పద మరి పోదాం రంగారావుగా రింటికి."

"ఆయనే యిక్కడికి వస్తారు. ఎవరికోసం వస్తారేమిటి ?"

3

"ఏయ్, ఏంచూపు అది ?"

"ఎందుకు చెయి పట్టుకుంటావు ?"

"ఏం ?"

"మన కెప్పటినుంచీ పరిచయం ?"

"ఎందుకు ?"

"ఇదివర కెప్పుడూ పట్టుకోలేదేం ?"

"కొంటెప్రశ్నలు వేయకుండా నిన్నేం చేస్తానోతెలుసా?"

"చెయి పట్టుకుని ? ఏం చేద్దామని ?"

"ఏం చేద్దామనా ? ఏం చేసినా చేద్దామనే .... ఈ మొత్తం నాది. ఏం చేసినా చేసుకోవచ్చు."

"సర్వాబద్ధం. ఈ నిలువంతా నా సొంతం. నేనేం చెపితే అది చెయ్యాలి."

"ఒత్తిది."

"అక్షరాలా నిజం. ఒకళ్ళను నేను భిక్షం అడిగి, భాస్కర్ అనే పిరికి అబ్బాయిని సంపాయించుకుని, నాస్వామిగా చేసుకున్నాను. నామాట అతను వినాలా లేదా చెప్పు."

"స్వామి అయింతర్వాత ఆ అబ్బాయిలోకి ఎంత బలం వచ్చిందంటే, నీ చేతినే గాదు—నీ మొత్తాన్నీ చేతుల్లో యిరికించుకుని ఇట్లా నలిపివేయగలడు."

. . . . . .

. . . . . .

"మా అమ్మతో చెప్పుతాను, చెపుతున్నా."

"మీ అమ్మే నా చేతుల్లో పెట్టింది నిన్ను, మాట వినటం లేదు, తీసుకెళ్లమని."

"అబద్ధం. నా చేతిలో పెట్టింది నిన్ను. పెట్టిందేమో మామయ్య. నేను చేతులు జాచాను. ఇచ్చేశారు. మళ్లీ పోయి అడుగుతాను. మామయ్యా మామయ్యా మీ అబ్బాయి నేమో యిచ్చారుగాని, ఆ అబ్బాయి మాట వినటంలేదు. ఒక బెత్తంగూడ యివ్వగూడదూ— అంటాను."

"మానాన్న బెత్తం యెందుకు యిస్తాడూ ? పువ్వు యిస్తాడు. ఇచ్చి చెపుతాడూ—అమ్మా, ఇందులో మాయాస్త్రం ఉందీ, దీంతో కొడితే వాడి స్మృతి పోతుంది. పిదప నీ పని చూసుకో—అంటాడు."

"ఆ పప్పులు ఉడకవు మామయ్యా, మీచేతి బెత్తం యిలా తెండి అంటాను—."

'ఆయన చేతిబెత్తం నీ కెప్పుడూ రాదు. అది ఆయన చేతిలోనే ఉండిపోతుంది."

"ఆయన్నీ, ఆయన చేతినీ, ఆయన చేతిబెత్తాన్నీ .... మొత్తం నా గుప్పిటలో ముడుస్తాను తెలుసా."

"నిజమేనా కాంతీ, ఆపని చేయగలుగుతావా ! నువు మా నాన్నని సంతోషపెట్టగలిగితే, నీనుంచి నే నింకేం కోరను కాంతీ! నీకేం తెలుసు ఆయన ఎంత పట్టుదలగల మనిషో! ఈ ప్రశ్నమీద ఆయన ప్రాణం ముడిపెట్టి బెదిరించాడు. అటువంటి మనిషిని నీవు వంచగలుగుతావా ? నీ కొడుకు పొర పాటు పడలేదని ఆయనకు రుజూచెయ్యి కాంతీ !"

"ఇంకేమైనా వరాలు .... కోరుకోవచ్చు యింకా."

"ఇంతవరకూ ప్రసన్నంగా మహాశక్తి."

"పూజా పుష్పాలు ?"

"ఏంపూలు కావాలో !"

"ఏంపూలు దొరుకుతాయి ?"

"ఈ భక్తుడు మీ పాదాక్రాంతం."

"నే నదేం కోరను."

"చెప్పిందల్లా వింటాను."

"నువ్వు వినేదేమిటి ? మీ బాబులు మా చేతుల్లో ఉంటే మీ పిలకలు మా వేళ్లల్లో ఉంటాయి.

"అయితే నాతో నీకు పనే లేదంటావు !"

"నా కివ్వగలిగిందేమీ లేదు నీవద్ద. నాకన్నీ ఉన్నాయి."

"ఏలోపం లేదూ ?"

"చిన్నమెత్తుకూడా లేదు."

"ఒక్కటి మాత్రం నేనే యివ్వాలి."

"అబ్బో ఏమిటో అది !"

"ము ....."

"అఖ్ఖర్లా, నేనే యిస్తాను. Action and reaction are equal and opposite అనీ, వెంటనే బాకీ తీరిపోతుంది.....ఇంతే !"

"నీ మాట వినఖ్ఖర్లేదన్న మాటేగా ?"

"వినిపిస్తానన్నమాట. ఒకబ్బాయి నా బంటు."

"కాదు, కాబోడు."

"ఆ అబ్బాయిచేత టీ పెట్టించుక తాగాను. రానన్న సినిమాకు లాక్కెళ్ళాను. కావాలన్న పిల్లను కాకుండా చేశాను. వొద్దన్న పిల్లను అంటగట్టాను. శ్రీరాముడిచేత తండ్రికి ఎదురు చెప్పించాను. ఇంకా బింకాలు పలుకుతున్నాడు, తినిపిస్తాను థ్రోకా."

"మోసపోయాడు. ఇక మోసపోడు."

"మోసపడింతర్వాత ఇక లేచే వీలే లేదు. అతను నా బంటు. తన తండ్రీ బంటే. తన అక్కా బంటే, తన అక్క కూతురూ అంతే."

"నువు కలలు గంటున్నావు కాంతీ ! అంత తేలికగా వీలుపడుతుం దనుకున్నావా ?"

"నాకు నమ్మకముంది. నిన్నూ, నన్నూ వాళ్లు మన సుల్లోగూడా ఏమీ అనుకోరు."

"Over Confidence. ఇంత నమ్మకం పనికి రాదు. నువ్వు అనుకునే అంత తేలిక కాదు. నువ్వు మంచిగా ప్రవర్తిద్దా మనుకుంటున్నావేమో ! వాళ్లకు కావలసింది అంద కుండా పోయింతర్వాత నీ మంచితనం అంతా వాళ్లకు అనవసరం."

"ఒట్టి మంచితనంతో ఏమీగాదు. దానికి రంగులు పూయాలి. కొన్నిసార్లు మరకలు రాయాలి. ఏది గావాలంటే అది చేస్తాను సమయానికి."

"సినిమాగాదు కాంతీ యిది."

"పోట్లాటకు రెండుపక్షాలు గావాలి. పోట్లాడ కుండా మనసులో పెట్టుకునేవాళ్లకి, కొంచెం ఎగిరినపక్షం దగ్గరగా జరగాలి. ఇంకా దగ్గరగా జరగాలి.. ఇంకా యింకా దగ్గరగా జరిగితే, ఒకరోజున హృదయంగూడ దొరికిపోతుంది. శత్రువులు గాదుగా, పాలిచ్చినా విషం అనుకోటానికి.

"ఎగిరేవాళ్లకు దిగటం చాతకాదు."

"నాకు ఎగరటం దిగటం సమంగా చాతౌను."

"నాకు అలా జరగాలని కోరికేగాని, జరుగుతుందనే ఆశ అంతగా లేదు కాంతీ !"

"నాకు ఆ ఆశ లేకపోతే, నిన్ను ఈ రొంపిలోకి దిగ నిచ్చేదాన్నే గాదు."

"నేను దిగివచ్చానంటావా ? ఇలాంటి తిరుగుళ్లు వస్తా యనే, నేను ముందు జాగ్రత్త తీసుకున్నకుందికీ .... నీవేగా, చెవి పట్టుకున్నట్టు పట్టుకుంది ?"

"అవును బాబూ అవును. నేనే దింపుకున్నాను తమర్ని రొంపిలోకి. నన్ను చెంపకుందికీ ఎందుకు కొట్టాల్సి వొచ్చింది ?"

"ఎందుకా నాచేత కలలుగనిపించి, లేదనబోయినందుకు."

"ఎవరు దిగారు మరి రొంపిలోకి ?"

"నన్ను కలలుగనేట్టు ఎందుకు చేశావు ?"

"నాచేత ముందు కలలు కనిపించావు గనక. చెయి పట్టుకోగానే అపవిత్రుడివి అయ్యావా బాబూ ? నీ మేన గోడలుసంగతి చెప్పటానికి ? ఒక అమ్మాయికి నచ్చిన అబ్బాయి రెండో అమ్మాయికిగూడ నచ్చుతాడని తెలీదూ ? ఇతరులసొత్తుకు ఎక్కువ విలువ యిచ్చి, దాన్ని కాజేసే దాకా మనుషులు ఊరుకోరని తెలీదూ ? ఇంత చదువు కున్నావు, రమ్మన్నవాళ్లదగ్గరకు అమ్మాయిలు అంతగా పోరు. పొమ్మన్నవాళ్ల చుట్టూతా తిరుగుతారని ఆమాత్రం గ్రహించ చాతగాకపోయిం దెందుకని ? పైగా నిన్ను నేను చెరిపానూ ? మీ యింట్లో తగువులు పెట్టానూ ? మళ్లీ ఆమాట అనాలి చెవు ..... "

"..... లేకపోతే, చెవుతుందట, ఏమిటి చెప్పేది ?"

"సరేలే ఉండు. బదులు తీర్చుకోలేకపోతానటలే."

"తీర్చుకోరాదూ, ఆ తీర్చుకునేది యిప్పుడే. ఉఁ."

"తీర్చుకున్నప్పుడు తీర్చుకుంటాలే నీ కెందుకు ? ఊపి రాడకుండా బిగబడితే ఏమయిపోతారు మనుషులు ?"

"కొత్త చొక్కా తొడుక్కుంటే ఏమవుతుంది ? నలుగుతుంది."

"పువ్వును నలిపితే రెక్కలు వూడిపోతాయి. భద్రంగా పట్టుకుని వాసన చూసుకోవాలి."

"కొన్ని కొమ్మలు కోపం తెచ్చుకున్నకుందికీ ముచ్చ టగా ఉంటాయి."

"అత్తపత్తిలాగా ముడుచుకొనే మొగవాళ్ల కంటేనా ? భోగంవేషాలు అనుకుంటావని భయపడ్డాను గాని, లేకపోతేనా, రాజాగారు అన్నానని ముడుచుకుపోయావే—ఆరోజున, రాధ కృష్ణుణ్ణిలాగా, గిల్లి ముద్దుపెట్టుకోవా లనిపించింది. నాచేత యిన్ని కలలు కనిపించావు. నాచేత మామయ్య నడిగించావు. నిన్నేం చెయ్యాలి ? ఆడపిల్లలు యిట్లా అడగ్గా ఎప్పు డయినా విన్నావూ ? ఇంకా నువు ముందు జాగ్రత్త తీసు కున్నా నంటావా ? అసలు బోగంటక్కులు అన్నీ నువ్వు వేసి, నన్ను బొమ్మని జేశావు."

"బొమ్మ బంగారుబొమ్మ అయి, నా హృదయంమీద ధిమికిట తొక్కింది. లేకపోతే నన్నింత బంధంలోకి ఎలా తేగలిగేది ? ఒకమ్మాయినిగురించి కోరుకోబోయేముందు, ఆ అమ్మాయితో జీవితాంతం నిర్వికారంగా ఆనందించ గలుగుతానా— అని ఆలోచించుకుందాం అనుకునేవాణ్ణి. ఎన్నో బొమ్మలు ఈ ప్రశ్న వేసుకోగానే ఆలోచన మడతల్లోనుంచి ఆవిరై పోయేది. చాలా బొమ్మలు నా మేనగోడలు పోలికల్లో కొట్టుకు పోయేవి. ఇంకా కొన్ని మా నాన్న కోరికా—పట్టుదల కోసం— బలి అయిపోయేవి. ఇన్నిటికీ ఎదురుతిరిగి, ఇంకా బలవత్తర మయి, రోరోజూ నన్ను బలహీనపరచిన ఈ ఒక్కబొమ్మ నన్ను వద్దన్నకొద్దీ పద్మవ్యూహంలోకి లాక్కుంది. ఆలోచించ గూడ దనుకుని, ఆ బొమ్మనుగదా ఆలోచించగూడదు అను కున్నాను, అనుకునేవాణ్ణి. కొంచెం వుండి ఆ బొమ్మ మాయింటి ఆవరణలో, తర్వాత మా పెద్ద యింట్లో, పిదప నాస్టడీ-రూంలో, ఆ రూంలో టేబిల్‌మీద కూర్చుని, నే చదువు కునే పుస్తకానికి తన పైటచెరగు అడ్డం వేసినట్టు—చివరకు నా గుండెలమీద డాన్సు చేసినట్టు—ఒట్టిపుణ్యానికి నాచేత యింతదూరం ఆలోచనచేయించిన బొమ్మని, ఏంచెయ్యాలి? దిండును మెలికలు తిప్పినట్టు ఒళ్లు హూనంజేసి బజ్జో పెట్టాలి."

. . . . . .

. . . . . .

"అటు చూడు."

"ఆఁ ?"

"అద్దంలో."

"ఏం వుంది ? ఒక అబ్బాయీ, ఒక అమ్మాయీ."

"ఇద్దరినీ తన ఫ్రేములో యిరికించి చూపుతోంది అద్దం."

"అందులో అబ్బాయి కొంచెం మెతక. పాపం గడుసు పిల్ల చేతుల్లో బడిపోయాడు."

"ఈ యిద్దరూ ఒకటేనోహో .... అని చాటుతోంది. అందులో అబ్బాయికి యింకా కొంచెం మైకం కమ్మి ఉండటం గూడ కన్పిస్తోంది చూడు."

"అమ్మాయికి మైకంమందుగూడ తెలుసు అంటోంది గదూ."

"అద్దం ఏంచేసిందంటే—అమ్మాయిని మాత్రమే ఒంటరిగా చూపింది. ఆ అమ్మాయి దిగాలుగా ఎవరికోసమో ఎదురుచూస్తోంది. మళ్లీ ఆ అబ్బాయి ఒక్కణ్ణే చూపింది. ఆ అబ్బాయిగూడ ఎవరికోసమో వెతుకుతున్నట్టు కన్పించాడు గాని, ఆ వెతికేది ఎవరినోగూడ ఆ అబ్బాయికే తెలియని మైకంలో ఉన్నాడు. అద్దం ఈసారి అమ్మాయినీ అబ్బా యినీ కలిపి చూపించింది. ఆ అమ్మాయి గుర్తు పట్టేసింది. తను ఈ అబ్బాయికోసమే వెతుకుతున్నట్టు. ఆ అబ్బాయి 'ఈ అమ్మాయినేనా నేను వెతుకుతున్నది' అన్న అనుమా నంలో పడ్డాడు. అద్దం అన్నదిగదా 'పిచ్చి అబ్బాయీ! నువ్వు ఈ అమ్మాయిని వెతుకుతుండకపోతే, నేను నీ కేర్పరచిన పరిధి లోకి ఈపిల్లను ఎందుకు రానిస్తాను ? మీ జంటను ఎందుకు చూపిస్తాను ? ఈ పిల్లనే వెతుకుతున్నావు. అంత మరుపు కూడదు. పిచ్చి నాయనా, స్వీకరించవోయీ' అన్నది. అదీ కథ—

—చూచావా, గడుసుపిల్ల కాదు ఆ అమ్మాయి, గురి కుదిరిన అమ్మాయి. ఆ అబ్బాయి మదిచెదిరిన అబ్బాయి. అంతే తేడా."

"అబ్బాయికి మది కుదిరింది."

"అద్దంలో అబ్బాయికి కుదరలేదు. ఎందుకంటే అద్దంలో అబ్బాయి అద్దం బయటికి చూస్తున్నాడు. చూడూ ఆ అబ్బాయి నావంక చూస్తున్నాడు—అద్దం బయటఉన్న పిల్ల అద్దం బయటఉన్న అబ్బాయి ముఖాన్ని తనవైపు లాక్కుంది. బహుశా అద్దంలో పిల్లగూడా అద్దంలో అబ్బాయిని అలాగే లాక్కుని ఉంటుంది."

"ఆ అబ్బాయికి కొంచెం కోపం వచ్చిఉంటుంది, చూద్దామా ?"

"ఒద్దు. మళ్లీ బెదిరిపోతారు. ఆ అబ్బాయికి అంతేలే, కోపంకాదు. దాన్ని కోపం అనుకుంటాడు, ఈ అబ్బాయి లాగా. తనకు కోపం వచ్చిందో, కోరిక గలిగిందో తెలుసుకోకుండానే చేతుల్లో బలం ఉందిగదా అని—పాపం, ఆపిల్లని చేతుల్లో యిరికించుకుని ఊపిరాడకుండా జేస్తాడు. స్వాములం అయ్యాం గదా, ఎలా చేసినా చెల్లుతుం దనుకుంటారు."

"చూడు"

".....''

"నాకు చాతగాదు నా తృప్తిని వర్ణించటం, ఏం చెయ్యనూ ?"

"ఎందుకు వర్ణించటం ?"

"పసివాడికి పాఠాలు నేర్పేందుకు చాలా తెలిసిన గురువు చెప్పే పిట్టకథల్లాగా ఏదో నువ్వు చెపుతుంటే, ఏ సీమల్లోనో తేలిపోయి, నీ ఒళ్లో దాక్కోవటం తప్ప—నా హృదయం, నా తృప్తి నీకు చెప్పలేకపోతున్నానే అని ఎంత తెపతెపగా ఉందో, నీకెట్లా తెలుస్తుంది కాంతీ ?"

"ఇంత పిచ్చివాడివేం స్వామీ నువ్వు ? నిజంగా నేనే లేకపోతేనా నీలో సగం మంచితనం, సగం గొప్పతనం, నీలో సగం ప్రతిదీ నివురుగమ్మి ఉండేది. ఎవరూ తెలుసుకునే వాళ్లుగాదు. పందెం మరి, మీ మేనగోడలికి నాకు తెలిసిన దాంట్లో సగం గూడ తెలియదు నిన్ను గురించి. అందుకని నువ్వు నాకు దక్కకపోతే నేనేడ్చిందాంట్లో సగంగూడ ఏడవటం చాతగాదు ఆ అమ్మాయికి. ఎందుకంటే, వాళ్లకు నువ్వు తెలివిగలవాడివి, మాట వినేవాడివి, అయినవాడివీ అనే తెలుసుగాని—హృదయానికి హృదయం యిస్తావనీ, మాటకు ప్రాణం యిస్తావనీ, మంచిని యింత పోషిస్తావనీ అంగుళం గూడ తెలీదు వాళ్లకి. మాటమీరని కొడుకు వాళ్లకు తెలుసు గాని, మానవుడు కావాలనుకునే 'మనిషి' నీలో ఉన్నాడని తెలీదు. స్త్రీ రాపాడాల్సిన రత్నాలు నీలో ఎన్నో ఉంటే, సాన పట్టిన రత్నానివి అనుకుంటారు వాళ్లు. నీలో సంపూర్ణత ఎందులో ఉందో, అసంపూర్ణత ఎందులో ఉందో వాళ్లకు తెలీదు."

"ఒద్దు కాంతీ, నువు నన్ను పొగిడినకుందికీ నా అసమర్థత మరీ బయటపడిపోతోంది."

"బయటబడడం యిప్పుడేమిటి ? నాకు తెలీదనుకున్నావా ? అదే చెప్పబోతున్నది. పొగడటంగాదు నిన్ను, నీ పిచ్చితనం చూపిస్తాను. నీ తృప్తిని వర్ణించలేకపోతున్నానంటావు ? అంటే, నన్ను పొగడటం చాతగావటంలేదు అంటావు ?"

"I don't wish to exchange my this partnership anything else cn earth అంటే ఏమిటో తెలిపోతోంది. మనిషికి ఎన్ని ఆదర్శాలూ, ఎన్ని అవరోధాలూ ఉన్నా, మానవుడు సుఖించి మరణించటం కోసం గాదూ, సంఘం కోరి సాగించే పోరాటం? Such peaceful happy end is in my arms. నా కౌగిలిలో ఇరుక్కుని ఉంది ఆసుఖం, శాంతీ, సౌందర్యం ....."

"చాలు చాలిక. చాలా చెప్పేశావు చాతగాదంటూనే. ఎవరు అడిగారు నన్ను పొగడమని, ఎవరు చెప్పారు పొగడకుండా స్త్రీలు మీ తృప్తిని తెలుసుకోలేరని ?"

"నాకు తెలిసిం దంత."

"నిజంగా నీకు తెలిసిందే అంత. లేకపోతే ఈమాత్రం తెలీదూ ? తనను బిగించిన చేతుల బలంలో ఎదటి వ్యక్తిలో తనకోసం గల అపేక్షని స్త్రీ గుణిస్తుంది."

"కాంతీ ! ..... "....."

4

"మామగారి కెందుకనో నామీద కోపం."

".....''

"నచ్చలేదేమో నేను."

".....''

"అందంగా ఉండననో, బుద్ధిమాలినదాన్ననో."

"నువ్వంటే నాకేం కోపం, నా కర్మకు ఏడుపుగాని."

"ఏం కర్మో అది ? నేను కోడలు గావటమా ?"

"ఛీ! మానెయ్ మాటలు. ఇంతదూరం ఆలోచిస్తావ్."

"మనమరాలు మీ కోడలు గాకుండా జేశాననేగా ?"

"అమ్మాయ్, మాటలు పెంచకు, మనస్పర్థ లింకా పెరగటం నా కిష్టంలేదు."

"లేకపోతే, కొడుకును మీ మాటను వినకుండా జేశానని అయివుంటుంది."

"నాకు నిజంగానే కోపం వచ్చేస్తోంది."

"కాని మీరంటే నాకెంతో మమత."

".....''

"ఒక్కసారి మీకు కోపం తెప్పించాలని కోరిక."

".....''

"ఒక్కదెబ్బగాని మీచేతిది తింటే చక్కగా కాపురం జేసుకుంటాను."

".....''

"చేసిందంతా నేను. మీ మనస్సును నొప్పించి, నా యిష్టం తీర్చుకున్నాను."

"ఇదుగో నాకింకా కోపం తెప్పించకు."

"కాని మీరంటే నాకెంతో మమత."

"మమత .... ఎందుకనో ?"

"నా కింతటి మొగుణ్ణి కనిపెట్టారని మీరు."

"పిచ్చిపిల్ల ....."

"మిమ్ముల్నే మామయ్యా అనన ?"

"అను తల్లీ, దాంట్లో ఏముంది."

"నిజంగా మామయ్యా, మీ అబ్బాయంటే నాకెంతో ప్రేమ."....

"మీ అబ్బాయికూడా తెలీకుండా నేనే మోసం జేశాను."

"....."

"నిజంచెప్పు మామయ్యా, మీ అబ్బా యెప్పుడైనా ఎదురాడారా మీకు ?"

"ఎదురు చెప్పట మిదే మొదలు."

"ఇది నే చెప్పించింది. అదిగూడ గాదు. నేనే చెప్పింది."

"అయితే యికెప్పుడూ ఎరగడు."

"మరి ఈసారి ఎందుకు జరిగింది ?"

"....."

"నేనే మామయ్యా, మీ అబ్బాయంటే యిష్టంకొద్దీ మోసంచేశాను."

"....."

"మాట్లాడరేం మామయ్యా ?"

"వింటున్నా చెప్పమ్మా."

"కాదు వినటంలా నరిగా."

"వింటున్నానంటే ....."

"కోపంవస్తే మీ బెత్తం ఉందిగా, ముందు వినాలి మామయ్యా."

"చెప్పు మరి ?"

"పెళ్లికిముందు ఒకసారి సినిమాకు రమ్మన్నాను మామయ్యా మీ అబ్బాయిని. ఏదో పనున్నదని రానన్నాడు. నాకేమో వెళ్లాలని బాగా ఉంది. చెయిపట్టుకు గుంజి రమ్మన్నాను. మాట్లాడకుండా ఒచ్చేశాడు. తర్వాత ఏదో మాటమీద తీసుకొచ్చి యిట్లా చెప్పాడు, నాకు బాగా జ్ఞాపకం : 'నాకు ప్రపంచంలో ఒక్క వ్యక్తి మాటలు వినితీరాల్సిన అవసరం ఉంది కాంతీ. ఆ వ్యక్తిని మినహాయిస్తే ప్రపంచం మొత్తాన్నీ ఎదుర్కోగలను. నాది ఒప్పు అనుకుంటే యిక ఎవరు జెప్పినా వినను. ఆవ్యక్తి మానాన్న' అన్నాడు. సంభాషణ యింకొంచెం సాగిన తర్వాత మెల్లగా మీ మనమరాలి యోగ్యతలు చెప్పాడు. మళ్లీ కాస్త ఆగి 'మా నాన్న ఆ అమ్మాయినీ, నన్నూ పిలిచి చెరో రెక్కా పట్టుకుని పైకి లేపమనేవాడు. లేపింతర్వాత ఈ రెక్కలు మీ రిద్దరేరా అనేవాడు' అని చెప్పాడు. నేను మాత్రం గతుక్కుమన్నాను. ఎందుకు నా కీ విషయం చెప్పటం?

"అసలు మొదట ఎప్పుడయినా అటూ యిటూ దారిలో కన్పించేవాడు. ఎవరో అందంగా ఉంటాడే అనుకుంటూ పోయేదాన్ని. అటువంటిది ఒకసారి మా అక్కతో కలిసి వాళ్ల కాలేజీలో డ్రామా జరుగుతుందంటే వెళ్లాను. సాయంకాలం డ్రామాఅట. ఉదయం ఏర్పాట్లు ఎలా ఉన్నాయోనని బయలు దేరిన అక్కతో నేనూ బయలుదేరాను ఏమీ తోచక. స్టేజీ దగ్గరగా ఒక వెదురుగడ ప్రక్కగా మీ అబ్బాయి ఏదో పని జేస్తున్నాడు. ఏదైనా చేసి 'సారీ' అందామనిపించింది. గడ కదిలించాను. అది తలకు తగులుతుం దనుకున్నాను. ఇంతలో మీ అబ్బాయి యిటు చూచేప్పటికి తలకు తగలవలసిన గడ ముక్కుకు తగిలింది. ఇంకా నయం కంటికి తగిలిందిగాదు. ముక్కు బెదిరి బొటబొటా రక్తం కారింది. నాకు భలే భయం వేసింది. 'సారీ' అనటం గూడ మర్చిపోయి దగ్గర నిల్చున్నాను. మీ అబ్బాయికి కళ్లలో నీళ్లు తిరుగుతున్నయ్. ముక్కు బాగా రక్తం కారుతోంది. పైకిమాత్రం నవ్వుతున్నాడు, నన్ను జూచి. జేబులు వెతికితే రుమాలు కనిపించలేదు, రక్తం తుడుచుకోను. నాది యిచ్చాను. రక్తం తుడుచుకుంటుంటే, మళ్లీ అదే రక్తం ముఖంనిండా అవుతోంది. ఏమిటా అని గాబోలు చూస్తే, నేనిచ్చింది సిల్కు రుమాలు. చిన్నగా నవ్వి 'సిల్కురుమాలు చాలా పనిజేస్తుందే' అన్నాడు. నేనూ నవ్వాను. జేబుగుడ్డ అంతా తడిసిపోయింది. 'ఇది పనికి రాదు యిక, మరి మీకు రుమాలు లేదుగాబోలు' అన్నాడు. "లేదు అన్నాను. 'లేకపోతే మానెలే' అని ఎందు కనలేదా అనుకున్నానుగాని, తర్వాత అననందుకు సంతోషించుకున్నాను. 'ఉండండి నారూంనుంచి తెప్పిస్తాను' అని ఎవరో కుర్రాణ్ణి పిలిచి తాళాలిచ్చి పంపి, రెండు జేబుగుడ్డలు తెప్పించి, రెండోది నా కిచ్చాడు. ఇస్తూ 'నాదగ్గర సిల్కు రుమాళ్లు లేవు' అని నవ్వాడు.

"తర్వాత రుమాలు యిస్త్రీ నుంచి వచ్చింతర్వాత, తీసుకొచ్చి యివ్వబోయాడు. 'మీ రిచ్చినా నేను మాత్రం మీది యివ్వను' అన్నాను. నాకు యిచ్చిన రుమాల్‌మీద పువ్వు కుట్టి వుంది. అది మీ కూతురు కుట్టిందటగా ?"

"కూతురుకేం చాతౌను ? మనమరాలు కుట్టివుండాలి."

"సరేలెండి. ఆ జేబుగుడ్డ నాదగ్గర ఉంది. అది యివ్వనన్నాను. సరే యివ్వకపోతే మానె, దీన్ని తీసుకోటానికి అభ్యంతరం ఎందుకు అన్నాడు. ఒకళ్లు వాడింది నా కెందుకు అన్నాను. 'నాది నేను వాడకుండానే యిచ్చాననుకున్నారా' అన్నాడు.

'నాది మీరు వాడుకుని, మళ్లీ వాపసు యిస్తే పుచ్చుకోను గాని, మీవైతే శుభ్రంగా వాడుకుంటాను' అని చెప్పాను. 'కాని దీన్ని నేనేం జేసుకోను, ముక్కు తుడిస్తే ముఖాని కవుతుంది' అన్నాడు. 'మళ్లీ ఏదయినా గడ కదిలిస్తాను. ముక్కు అడ్డం పెట్టండి, ఉపయోగపడుతుంది' అన్నాను. నవ్వుకుంటూ వెళ్లిపోయాడు.

"తర్వాత కొంచెం పరిచయం పెరిగింది. మీ అబ్బాయి మా యింటికి మూడుసార్లు వచ్చాడో నాలుగుసార్లో గాని, నేను చాలసార్లు మీ అబ్బాయి రూంకి పోయేదాన్ని. తను తాగేప్పుడు పోతే టీ గాని, కాఫీ గాని యిచ్చేవాడు. నేనుమాత్రం పోయినప్పుడల్లా టీ అడిగేదాన్ని. కావాలంటే కాసుకుని, నాకు

గూడా కొంచెం యివ్వు గాని, నే నెక్కడ కాసిపెట్టేది అనేవాడు. నేను మాత్రం కాసేదాన్ని గాదు. అంతవరకే మా పరిచయం.

"కాని సినిమాకు రమ్మని చెయిబట్టి లాగడం—అలా శారీరకంగా బలవంతం చెయ్యడం అదే మొదట. ఆరోజునే మీ సంగతీ, మీ మనుమరాలి సంగతీ చెప్పాడు. నేనే మనుకోవాలి ?

"నాకు కలగని ఉద్దేశాన్ని ఆరోజు కలిగేట్టు జేశాడు మామయ్యా మీ అబ్బాయి. నేను అక్కడకు మీ అబ్బాయిని కోరినట్టు, ఆయన మహా పితృవాక్యపరిపాలకుడు అయినట్టూ, మాట యిస్తే తప్పనట్టూ, నన్ను మోసం జేయకుండా ఉండాలన్నట్టూ, అందుకని మొదట్లోనే హంసపాదు పెట్టినట్టూ ! నాకుమాత్రం వొళ్ళు మండింది. "నేనే ఆడదాన్నయితేనా, నిన్నే పెళ్లిజేసుకుంటాను చూడు' అన్నాను నామనసులోని మీ అబ్బాయితో. నాతో మాట్లాడడానికి ఉబలాట పడేవాళ్ళు లక్షమంది. మీ అబ్బాయికి నేనంటే అంత తేలికగా ఉంది, చూడండి వ్యత్యాసం !

"అసలు ఆరోజునుంచీ బానిసనయానంటే నిజం. నే నెరుగుదును. నిజంగా మేనకోడళ్ళు లేనివాళ్ళుగూడ పెళ్లి జేసుకుంటామని మాటయిచ్చి, తనతో యిష్టం వచ్చినట్టు తిప్పుకుని, చివరకు హీనమైన కట్నంకోసం ఈ పిల్లను కళ్ళతో చూడకపోయిన మహావ్యక్తుల్ని నే నెరుగుదును. పనిమాల పరిచయం కలుగజేసుకుంటారు అటువంటివాళ్ళు. కాని ఈ పరిచయానికి ప్రారంభకురాల్ని నేను. పరిచయానికి పెడర్థం తీయంది మీ అబ్బాయి. పెడబడుతుందేమో, నా జీవితం నాశనంగాకుండా, మీ మనస్సును నొప్పించకుండా ఉండటానికి ప్రయత్నించింది మీ అబ్బాయి. అటువంటి మొగుడు నాకంత తేలికగా ఎక్కడ దొరుకుతాడు ? చేతిలో ఉన్నవాళ్ళని ఎలా వదులుకోవటం ? మీరు, మీ మనుమరాలు గుర్తు వచ్చారు గాని మీకోసం మీ అబ్బాయిని వదిలెయ్యటానికీ నా త్యాగమే పెద్దది అనిపించింది. నే చెపుతున్నాగా మామయ్యా నాకోసం మిమ్మల్ని కష్టపెట్టాను. అసలు ప్రేమ అంటేనే స్వార్థం.

"ఏమైనా సరే మీ అబ్బాయిని పెళ్లిచేసుకోవా లనుకున్నాను."

"రోజూ వీలైనన్నిసార్లు రూంకు పోయేదాన్ని. ఇష్టమొచ్చిందంతా కెలికేదాన్ని. చెయ్యాల్సిన అల్లరంతా చేసేదాన్ని. ఎప్పుడు గావాలంటే అప్పుడు టీ కాసుకోవటం, తాగటం. కావాలంటే మీ అబ్బాయికి యిచ్చేదాన్ని. లేకపోతే మొత్తం నేనే తాగేదాన్ని. డబ్బులుగూడ దొంగతనం చేసుకెళ్లి ఏవో కొనుక్కొచ్చి చూపేదాన్ని. అప్పుడప్పుడు తిట్టేవాడు గూడాను, దులపరించుకుపోయేదాన్ని.

"రూముకు రెండు తాళా లుండేవి. ఒకటి నేను తీసుకున్నాను. ఇక రూములో అతనున్నా లేకపోయినా నానా రభసా చేసేదాన్ని. నా స్నేహితురాళ్ళను గూడ తీసుకుపోయి అప్పుడప్పుడు అక్కడ మకాం వేసేదాన్ని. ఒకసారి మీ అబ్బాయి ఫొటోకి మేమంతా కలిసి వేషా లేస్తుండేటప్పటికి మీ అబ్బాయే వచ్చి చూసి, 'మీకంటే బాగానే ఉంటాను' లెమ్మన్నాడు. 'ఏది నాకంటే బాగా ఉంటావా, చూపు ముఖం' అంటూ మీదికి పోయాను. 'మా తల్లీ, నీవే బాగుంటావు' లెమ్మన్నాడు. అందరూ ఫక్కున నవ్వారు. 'అక్కడ టీ మిగిలివున్నై. తాగ' మన్నాను. 'మీరంతా తాగేసి అడుగూ, బొడుగూ నాకుంచారా' అన్నాడు. 'ఇంకా నయం ఉంచాం సంతోషించు' అంటుండగా ఆ టీ తెచ్చుకున్నాడు.

"ఇంకోసారి మీ అబ్బాయి బయటినుంచి వచ్చేప్పటికి నేను రూంలో పడుకొని నిద్రపోతున్నాను—మీ అబ్బాయి మంచంమీద పడుకుని, మీ అబ్బాయి దుప్పటి కప్పుకుని. తలుపు తట్టితే లేచిపోయి తలుపు తీశాను. ఏమిటో నా కళ్ళలోకి అలా చూచి, నన్ను తప్పుకుని టేబిల్‌వద్దకు పోయి కూర్చున్నాడు. నేను బద్ధకంగా కూచుని 'టీ గావాలి' అన్నాను. 'రాణిగారి కేం కాసిపెట్టాలా' అన్నాడు. 'మేం కాసుకుంటాంలే, రాజుగారికేం అఖ్ఖర్లేదా అంటున్నాం' అన్నాను. గప్‌చిప్. ఇక మాట్లాడలేదు. తర్వాత టీ యిచ్చాను. తాగి కదలకుండా, ఉన్నపాటున మళ్లీ బయటికి వెళ్లిపోయాడు.

"తర్వాత రెండు రోజులు బెదిరి బెదిరి చూచేవాడు నా కళ్ళలోకి."

"కొన్నాళ్ళయింతర్వాత యిలా చెప్పాడు నాతోటి. 'మా నాన్న యేకోర్కెనీ నా జీవితంలో ఎదిరించగూడ దనుకున్నాను కాంతీ. కాని నేను బలహీన పడిపోతున్నాను. ఒక విషయంలో ఆయనకు ఎదురుచెప్పక తప్పనంతగా నా హృదయం బలహీనపడింది. నాకు తెలుసు ఆ బలహీనత ఏదో. దానికోసం గదా నేను యిన్ని పాట్లూ పడత ! అందుకని ఏమిటా బలహీనత అని నే నడగలేదు. ఆ బలహీనత ఎంత పెరిగితే అంత మంచిది నాకు. ఆరోజున మీ ఫొటో నొకదాన్ని ఎన్‌లార్జి చేయించి గోడకు తగిలించి, రోజూ దాన్ని చూచుకుంటూ పడుకునేవాడు. నాకు నవ్వొచ్చింది. ఇలాటిగుణమే గాబోలు దేవుడిబొమ్మ చూచినప్పుడల్లా దణ్ణంపెట్టేట్టు జేసేది అనుకున్నాను.

"ఆపిదప వొచ్చింది మీ దగ్గరనుంచి ఉత్తరం, మనమరాల్ని జేసుకోవలసిందీ—అని. చదువుకుంటూ కూర్చున్న సమయంలో నేను వెళ్ళాను. ఉత్తరం చేతికిచ్చి చదవమన్నాడు. చదివాను. మీ అబ్బాయి కళ్ళలో నీళ్ళు గిర్రున తిరుగుతున్నై. 'ఛీ! యిదేమిటి, శుభమా అని ఉత్తరం వస్తే, కళ్ళలో నీళ్లేమిటి' అన్నాను. కొంచెంసేపటికి ఆ నీళ్ళు ఎండిపోయినై. తర్వాత నవ్వుతూ చెప్పాను. 'అందంగా ఉంటుంది, డబ్బు గలది, మేనగోడలు .... చేసుకో మరి' అంటుండేప్పటికి ఎదటికళ్ళలో నిప్పులు చూచాను. "మూసేయ్ నోరు" అని ఫెడీమని చెంపను కొట్టి, పోయి పడుకున్నాడు. ఏం తియ్యగా ఉందని మామయ్యా ఆ దెబ్బ !

"నేనూ మంచంమీదకు పోయి కూచున్నాను. మొట్టమొదటిసారిగా నాచేతిని అతని నడుంమీదుగా అవతల ఆనించుకున్నాను. "నువు చెప్పావుగా, ప్రపంచంలో మా నాన్నను మాత్రం ఎదిరించలేననీ .... ' అన్నాను. మరో ప్రక్కకు తిరిగి పడుకున్నాడు. మళ్లీ జుట్టు సవరిస్తూ చెప్పాను. 'నా కోరిక నిన్ను పెళ్లి చేసుకోవాలనే భాస్కర్, కాని నిన్ను యిరుకున

పెట్టుట మవుతున్నది గద. నీకే నేను కావలిస్తే, నీతో ప్రపంచంలో ఏమూల ఉండమన్నా ఉంటాను' అన్నాను. 'కాంతీ' అంటూ క్రితం నా ఊహ తెలిసింతర్వాత ఏ వ్యక్తితోనూ ఎరగనంత దగ్గరకు లాక్కున్నాడు.

"అప్పుడు నేనే చెప్పాను—మిమ్మల్ని యిక్కడకు వచ్చేటట్లు చేయమని"

"రాశాడు. మీ రొచ్చారు. తర్వాత జరిగిన విషయాలు మీకు తెలుసుగా."

"మెత్తటివాణ్ణిజేసి కొరుక్కుతిన్నావన్నమాట, నీ ముక్కు గొయ్య."

"ముక్కు గోస్తే మూడురోజులకే వస్తుంది, సిగ గొయ్యరాదూ మామయ్యా."

"ఇక మాటలకేం, కోటలు దాటేట్టు చెపుతావ్."

"కాదు మామయ్యా, మీ అబ్బాయి ముఖమే అంత. ఆ జుట్టు ఎప్పుడూ పీకాలనే అనిపిస్తుంది. ఒకసారి ముక్కు పట్టుకుని వూపాను. మళ్లీ రక్తం బొటబొట కారింది. ఈసారి రుమాలు యివ్వలేదు. నా సిల్కుపైట చెరగుతో సొంతంగా నేనే తుడిచాను. తుడుస్తూ తుడుస్తూ ఉండగానే ఒళ్లో పడుకుని, అలాగే నిద్రపోయాడు. ఆ నిద్ర చెడగొట్టాలా కూడదా అన్నది పెద్దప్రశ్న అయిపోయింది. ఆ కళ్లూ, ఆ పళ్లూ, ఆ చూపూ, ఆ రూపూ దేవుడు మీ అబ్బాయికి నాకోసమే యిచ్చాడు మామయ్యా. అంత అందంగా ఉంటాడేం నా కళ్లకి ? మీ అబ్బాయి గుణం అందమా, రూపం అందమా మామయ్యా ?"

"అన్నీ చెప్పావులే .... వొచ్చింతర్వాత రెండు మిరప కాయలు చుట్టిపారెయ్."

"మిరపకాయలుకాదు మామయ్యా, చేతులు చుట్టిపారేస్తానూ .... "

"చిలిపికొయ్య !"

5

"ఇదుగో, ఎక్కడికి ప్రయాణం ?"

"ఎందుకు ?"

"ఉండు సినిమాకు పోదాం."

"రేపు పోదాంలే."

"అవతల అర్జెంటు పనేమైనా ఉందా ?"

"లేదు, ఎందుకు ?"

"మరి సినిమాకు యివాళెందుకు పోగూడదు ?"

"ఏ, రేపెందుకు పోగూడదు ?"

"ఇవాళ రేపులాంటిదిగాదూ ?"

"రేపూ యివాళలాంటిదే."

"అందుకే యివాళ పోదామనటం."

"రేపు పోదాంలే."

"నే నన్నాననా, వద్దనటం ?"

"నేను రమ్మన్నప్పుడు నువ్వెందుకు రావు ?"

"అయితే యివాళ రానంటావ్ ?"

"రాను."

"బయటికి వెళతా నంటావ్ ?"

"వెళతాను."

"సరే వెళ్లు చూద్దాం, ఎలా వెళ్తావో !"

"దానికి గూడా రాణీగారి ఆజ్ఞే గావాలా యేం ?"

"సరే వెళ్లు .... "

"ఏ, వెళతానూ .... "

"వెళ్లమన్నాగా .... "

". . . . . "

"మావయ్యా ..... "

"ఏమిటమ్మా ?"

"వెళ్లాడా మీ అబ్బాయి ?"

"వెళుతున్నాడు, ఎందుకూ ?"

"వెళ్లనీకు మామయ్యా, నేను వచ్చిందాకా."

"భాస్కర్, ఏమిటిరా బడబడ ? నిల్చోమంటే కొంచెం నిల్చోరాదూ ?"

"ఉట్టినే నిల్చోమంటుంది నాన్నా, ఏం పనిలేదు."

"ఉట్టినే ఎందుకు నిల్చోమంటుంది నిల్చోవోయ్, కబుర్లు చెప్పక."

"ఉట్టినే ఎందుకు నిలబడమంటారు, తప్పు ఉంటేనే నిలబెడతారు. ఎక్కడికో వెళ్లటం కనుక్కోండి మామయ్యా."

"ఎక్కడికిరా వెళ్లటం ?"

"ఎక్కడికి వెళ్లటం అని అడగ్గూడదని నా కెన్నిసార్లు చెప్పావు నాన్నా ? పోనీ అడగాల్సివుంటే కాంతి అడగలేదూ ? నువ్వడగటం ఎందుకు ?"

"సరే చెప్పు, క్లబ్బుకేనా ?"

"ఆఁ."

"అబద్ధం. వెళుతున్నది సినిమాకి. చెపుతున్నది క్లబ్బుకని."

"నిజమేనటరా ?"

"నామాట ఎందుకు నమ్మవు నాన్నా ?"

"అబద్ధాలుగూడా నమ్మాలా బాబూ ?"

"నిన్నడగలేదు నేను, మా నాన్నని అడుగుతున్నాను."

"నాన్న చెప్పేమాటే యిది."

"నిజమేనా నాన్నా ?"

"అంతే నా ఉద్దేశం."

"నే నెప్పుడైనా అబద్ధం ఆడానా నాన్నా ?"

"ఈమధ్య నేర్చుకున్నావు."

"ఏం నాన్నా ?"

"అంతే నా ఉద్దేశం."

"మరీ అంత తేలికజేస్తున్నా వెందుకు నాన్నా నన్ను ?"

"ఎందుకా, నోటితో చెప్పాలా ? చెపుతాను విను. నువ్వు బొత్తిగా మారిపోయావు. నీలో పూర్వపు లక్షణాలు లేనే లేవు. నీ పెళ్లాం వచ్చిం దగ్గర్నుంచీ—కాదు, వస్తుం దనుకున్నప్పటినుంచీ—నువు మాట వినటం మానేశావు. లేకపోతే కాసేపు ఆగమన్నందుకు యీవర కెప్పుడయినా యిన్నిసార్లు వాగించావా ?"

"కాంతిదేవీ, తమరికో దణ్ణం. నే నడుగుతున్నది మా నాన్నని."

"అంతేరా నా ఉద్దేశం గూడాను."

"నాన్నా కాంతి నీకు కూతురా, కోడలా—అది చెప్పు ముందు."

". . . . . ."

"నవ్వి వూరుకుంటారేం మామయ్యా ? మాయిల్లు వొదిలిపెట్టి, వందల మైళ్లు యివతలకు వచ్చి, మీ యింట్లో ఉంటున్నానే .... మీ కూతురుగా చూసుకోవద్దూ మరి ?"

"పిచ్చితల్లి ?"

"బుట్టలో పడిపోయావు నాన్నా .... పిలక పట్టుకు ఆడిస్తోంది నిన్ను."

"అబద్ధం ఆడటంలేదంటావు పైగా, నాకు పిలక ఎక్కడిది ?"

"నిజం నాన్నా, నేను క్లబ్బుకే వెళ్లటం."

"ఎట్లా నమ్మకం ?"

"దానిమాట లెలా నమ్ముతావు ? అసలు సినిమాకు వెళదామన్నది అది. ఒద్దన్నవాణ్ణి నేను. గల్లంతుజేసి, నీ అండ జూచుకుని, నా ముక్కుకు దారం పోస్తున్నది."

"క్లబ్బుకే అయేట్టయితే తొందరేముంది, సినిమా టైం అయిందాకా కూర్చోమను మామయ్యా."

"సరే కూర్చుంటావటరా ?"

"నేను సినిమాకు పోవటంలేదు నాన్నా, బళ్లో పిల్లాణ్ణి లాగా ఎందుకు కూర్చోబెడతావు .... "

"ఏం యిబ్బందిలేదు, మీ నాన్నకి నీ వెప్పుడూ చిన్న వాడివే. పోనీ యింకో టీ యిస్తాను, కూర్చో చిన్నపని ఉంది."

"వెళ్లమ్మా, నీ పని చూసుకో, ఎందుకు కూర్చోడు ?"

. . . . . .

. . . . . .

"నీకేం మందు పోసింది నాన్నా కాంతి, ఎప్పుడూ దాని తరఫునే మాట్లాడతావు ?"

"మంచిపిల్లను ఏరుకున్నావురా."

"చాలా పొరపాటుపడ్డా ననుకుంటున్నాను. ప్రతిసారీ యిద్దరూ కలిసి నామీద స్వారి చేస్తుంటే, నేనేం బ్రతకాలా?"

"నీకేం లోపమయింది చెప్పు ?"

"మొన్న వంటయింట్లోంచి వెళ్లగొట్టినంతపని జేశారా ?"

"వంటయింట్లో నీకేంపని ?"

"చలికి పొయిముందు కూర్చున్నాను."

"ఆ పొగలో నువ్వెందుకు ?"

"తనెల్లా కూర్చుంటుంది ?"

"అందుకని నువ్వూ కూర్చోవాలా ? వంట ఎవరు జేస్తారు, అదిగూడ యివతలకు వస్తే ?"

"పోనీ దాని కష్టం నేనుగూడా పంచుకుంటాను ..... అంతా వంక, చలికి పొయిముందు కూర్చోవటం మరిగి, నేను అడ్డమయిపోయానని గెంటించింది."

"కొత్త పాయి కట్టించమని మొత్తుకుంటుంటే గతి లేదుగాని కష్టం పంచుకుంటాడట, కష్టం ! బడుద్ధాయి కబుర్లు చెపుతా వెందుకు ? దానికష్టం తీసేస్తే వొప్పు కుంటుంది గాని, అదేం లేకుండా, దానితోపాటు నువు గూడా కష్టపడతానంటే దానికేం ఒరిగింది ? నేను పనివాణ్ణి తీసు కొచ్చిందాకా దానిమొర విన్నవాళ్లు లేరు, పొగలోకి రావద్దన్న దని వెళ్లగొట్టిందంటావా ?

"మరి నారూంలోకి ఎందుకొస్తుంది తను ? పనిమీద ఉన్నప్పుడు గూడ కదిలించి, నాపని పాడుజేయటం ఎందుకు ? వచ్చి సరాసరి, నడి టేబుల్‌మీద ఎందుకు కూర్చోవాలి ?"

"పని మాత్రం వేళాపాళా లేదేమిటి ?"

"అవసరమైన పనులుగూడ మానుకుంటారా ?"

"నీకు ఇంటిదగ్గరకూడ పనిచేసేందుకు వాళ్లు డబ్బులు యివ్వటంలేదుగా. ఆఫీసులో చేసుకో, గట్టి చాకిరి చేస్తావో—వోటి చాకిరి చేస్తావో. ఇంట్లో దాని పెత్తనం సాగాల్సిందే."

"అందుకని నా రూంలో రాసుకునే టేబుల్‌మీద కాళ్లూపుతూ కూర్చుని, నువుగూర్చున్న ప్రతిచోటా సగ భాగం నాది అంటుంటే, పని మానుకుని నేనుగూడా పళ్లు యికిలించాలన్నమాట ! అదేమంటే మామయ్యను పిలుస్తా నంటుందీ ? నువ్వు నేర్పుతున్నావు నాన్నా దానికి అన్నీని."

"నువు దాని పనులు చెడగొట్టటంలా, దానికి ఉషా రుగా ఉన్నప్పుడు నువ్వు పనులు ముందేసుకోవటం దేనికి ?"

"దాని పని చెడినప్పుడల్లా నన్ను యింట్లోనుంచి తరుముతుంటిరిగా క్లబ్బుకు వొదిలిపోగానని. పోనీ, యిది చెప్పు నాన్నా. మొన్న అక్క—బావ వాళ్లొచ్చినప్పుడు ప్రతిదానికీ నన్ను కసురుకోవటం దేనికి ? లేనిపోని గొడవలుపెట్టి, మంచిగా పోవాలనుకునే నాతో ప్రతిసారీ తిట్లుతినటం దేనికి? అంటే వాళ్ల కుటుంబంమీద దానికి ఎటువంటిభావం ఉందో తెలీటంలా ?

"ఏం భావం ఉందేమిటి ?"

"ఏహ్యభావం."

"ఉంటే మీ అక్క ఎందుకు ఊరుకుంది ?"

"దీనిలాగా అదిగూడ పోట్లాట పెట్టుకోవాలా ?"

"కాంతి మీ అక్కతో పోట్లాడిందా ?"

"వాళ్ల యెదట నాతో పోట్లాడితే చాలదూ ?"

"పోనీ కష్టంతగిరితే, ఒక రోజు ముందయినా పోకుండా అన్ని రోజులు ఉండిపోయిందెందుకు, కూతురుతో సహా ?"

"ఏమో, ఏమందు పెట్టిందో నీకు పెట్టినలాగా."

"దానికి తగిలే ఆలోచనలు నీకుగూడా తగలవురా. నాకు ముందుగానే తెలుసు. నీతో ఆ నాలుగు రోజులూ కజ్జా లాడుతుందని. నాతో ముందే చెప్పింది."

"తెలిసే నువ్వుగూడ నాతో నాటకం ఆడావన్నమాట!"

"నీతోగూడ చెప్పమని చెప్పాను. మీ అబ్బాయికి నాటకా లాడటం చాతగాదు. తర్వాత అర్థంచేసుకుంటాడులే మామయ్యా అంది."

"ఇంతకీ ఎందుకు ఆ నాటకం అంతా ?"

"చెప్పమంటావా ? మీ సంసారం యింత అన్యోన్యంగా నడుస్తున్నదని నీ అక్క—మేనగోడలు తెలుసుకోకుండా ఉండాలని."

"అంత కళ్లు కుడతాయనుకుందా వాళ్లకి ?"

"చెప్పేది వినవోయ్ ముందు, తర్వాత పోట్లాడుదువు గాని. దానికి నేను అనుమతి యిచ్చాను, దాన్నేమన్నా అన్నా వంటే న న్నన్నట్టే చెపుతున్నా. మీ అక్కకి కళ్లు కుడతాయని కాదు. మీ అన్యోన్య సంసారం చూచి, తన కూతురు యిక్కడ ఉంటే, యింకెంత సుఖపడేదో అని విచారించకుండా ఉండ టానికి. నీకు గయ్యాళిపెళ్లాం దొరికిందే పాపం అని, వాళ్లకి నీమీద జాలీ—ప్రేమ నిలబడుగా నని. నీ మేనగోడలు మొగుణ్ణి నీతో పోల్చి, అతనితో అన్యోన్యంగా తిరక్కుండా సంసారం పాడుచేసుకోకుండా ఉండుగానని. ఎల్లకాలం యిలా నాటకా లతో ఏంపని ? నీ మేనగోడలు తన మొగుడితో అలవాటు పడిందాకా అక్కా వాళ్లతో కాంతి చనువు సంపాయించుకున్న దాకా—వాళ్లముందు కొంచెం యిదిగా ప్రవర్తించటమే నాకూ సమంజసంగా తోచింది. మనస్తత్వాలను అది గమ నించ గలిగినట్టు, నిజంపడితే నీకూ చాతకాదు."

"అయితే నాకోసం అది గయ్యాళీ, వాళ్లకి పగ అవుతుందన్నమాట ?"

"పగ అయిందా ? నీమాదిరిగా 'నీతోపాటు నేనూ చస్తాను' అన్నట్టు మాట్లాడిందా ? నీతో పోట్లాడినప్పు డల్లా మీ అక్కకు ఏదో సంజాయిషీ చెప్పుకుంది. మీ అక్కను వదినా అనకుండా పిన్నీ అంది. అయిపోయె, మీ అక్కగూడ కాంతికి తల్లి అయిపోయె. మెట్టిన యిళ్లుగూడ పుట్టిళ్లలా స్వర్గం చేసుకోగలిగిన వాళ్లు ఎంతమంది ఉంటారు ? నీ మేన గోడలిచేత అక్కా అనిపించుకుంది. అక్క మీ యిద్దరిమీదా పిసరంత కోపం లేకుండా వెళ్లిపోయింది. అది నాలుగు రోజులు మాత్రం ఉందామనుకుని, త్వరగా వెళ్లటానికి వీలుగా మొగుణ్ణి గూడ కూడా తెచ్చుకుంది. వొచ్చింతర్వాత మీ బావను సాగనంపి, యింకా పదిరోజులు ఉంది. నువ్వేమైనా గమనించావా యిదంతా ?"

"ఈ జిత్తులూ, ఈ టక్కులూ నా చాతగావు."

"నిజంగా కాంతే నా కూతు రయితేనా, అసలు పెళ్లి జేయకుండా యింట్లోనే అట్టేపెట్టుకునేవాణ్ణి."

"శుభ్రంగా లేచిపోయేది ఎవడితోనన్నా."

"ఛా ! చిలిపి కబుర్లూ నువ్వూను."

"అంతమాత్రపుది కాదనా నువ్వనుకోవటం ? ఎప్పు డయినా పిలిచి అడుగు చెబుతుంది. నాకయినా కాంతి చెప్ప లేదు. వాళ్లమ్మ చెప్పింది. నాతో కాంతికి పరిచయం పెరుగు తున్నదని తెలిసి, వాళ్లమ్మ ఒకసారి కోప్పడిందట, పల్లెటూరి చుట్టరికమంటే ఆమెకు ఆనినట్టుండక. కాంతిని నిలవదీస్తే నిక్కచ్చిగా చెప్పిందట. 'నన్ను ఆపి ప్రయోజనం లేదు. నేను మాత్రం శివునిముందు పార్వతిలాగా ఒక్కపూజ చేస్తు న్నాను. శివుడుగాని ఊఁ అన్నాడంటే, ఏడు ప్రాకారాలు గట్టినా ఎగిరిపోతాను' అందట. వాళ్ల నాన్నతో 'మీ పేరుకు చెడుజేయటానికి లోబడుతున్నా ననుకుంటే, విషం తింటాను నాన్నా, నన్ను నమ్మ' మందట. ఆయన నమ్మి వూరు కున్నారు. వాళ్లమ్మ ఏమీ చేయలేకపోయింది మరి. అటువం టిది నీవు పెళ్లి చేయకపోతే ఊరుకుంటుందా ?"

"వాళ్ల యింట్లోనూ యింత జరిగిం దటరా ?"

"అందుకుగాదూ, రంగారావుగారికేం తెలీదునాన్నా అని చెప్పింది ?"

"పిచ్చితల్లి, ఇంత మోజు పడిందటరా నీమీద ?"

"ఇప్పుడనా నామాట నమ్ము నాన్నా. సినిమాకు వద్దు అన్నది నేను. వెళ్లాలన్నది తను. నేను సినిమాకు పోతున్నానని నన్ను ఆపించింది నీచేత."

"వొట్టి కబుర్లు."

"సరే నేను అబద్ధం ఆడినవాడి నయానుగా. కాంతే సినిమాకు పోదామంటే మానుకుందా మంటావా ఈవేళ ?"

"అది పోదాం అంటే నువ్వు వద్దంటావా ?"

"ఎట్లా నాన్నా నీతో పెట్టుకుని ? సరే కాంతి పోదా మంటే పోదాం, వొద్దంటే వొద్దు. కాని కాంతి సినిమాకు పోదా మంటే, వాడు వెళ్తున్నా డంటివిగదా అని అడుగుతావా ?"

"సరే అడుగుతాను రానీ."

"అదుగో వస్తున్నది చూడు, సింగారించుకుని."

"ఏమిటి మామయ్యా, యింకా చొక్కా అయినా తొడుక్కోకుండా కూర్చున్నారు. సినిమా టైం అయిపోవ టంలా ?"

"వాడు సినిమాకు వెళుతున్నాడంటివేమమ్మా యిందాక?"

'మరి సినిమాకు గాక క్లబ్బుకా మామయ్యా పోతుంట? అందరం కలిసి సినిమాకు పోతున్నాం. క్లబ్బుకన్న మాట అబద్ధ మవునా కాదా ? కాకపోయినా, మామయ్యా, నా మొగుడేం సత్యహరిశ్చంద్రు డనుకున్నారా — నేను అబద్ధమాడకుండా ఉండటానికి ? అవసరం అయితే శుభ్రంగా అబద్ధం ఆడేస్తాను."

"అమ్మా రేపు ఎలక్షన్లలో పార్లమెంటుకు నిలబడ రాదూ, నేను డబ్బు పెడతాను."

"పార్లమెంటుకీ, వంటయింటికీ పొసగదులే మామయ్యా. పార్లమెంటు పనిజూసేవాళ్లు చాలమంది ఉన్నారు. ఇల్లాంటి ఒళ్లొంగని మనుషుల్ని పెట్టుకుని ఈ యిల్లు ఈదటానికి రమ్మను ఏ ఎం. పి. వల్ల అవుతుందో."